జగనన్నను మరోసారి ఆశీర్వదించండి


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: పార్టీలకు అతీతంగా సంక్షేమం పథకాలు అందిస్తూ ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని కె.శివరం గ్రామ సచివాలయం పరిధిలోని పేలుబండ ఎస్సీ, బీసీ, ఇందిరమ్మ కాలనీల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రజా సమస్యలపై కూడా ఆరా తీశారు. సచివాలయం పరిధిలో పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 98 శాతం అమలు చేసి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను సచివాలయ అధికారులకు తెలిపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ డైరెక్టర్లు గగన, రాజేశ్వరి, లక్ష్మీదేవి, వీరక్యాతరాయప్ప, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్.ఎంపీపీ కృష్ణమూర్తి, లలితమ్మ, సర్పంచ్ మంజుల, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని 18వ వార్డులో మంగళవారం బోయపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు కవిత ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించడంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమాల్లో బిజీగా ఉంటూ హిందూపురం ప్రజలను మరచిపోయారని విమర్శించారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ స్కూళ్లు మూసేయడంతో పాటు నారాయణ, చైతన్య లాంటి ప్రైవేటు స్కూళ్లకు దోచిపెట్టారన్నారు. అయితే ఇప్పుడు నాడు నేడుతో ప్రభుత్వ స్కూళ్లకు పూర్వ వైభవం దక్కిందన్నారు. ప్రజలకు వందశాతం సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆయుబ్, పరుశురాం, జేసీఎస్ కన్వీనర్ నౌషాద్, సోమశేఖర్‌రెడ్డి, ఇలియాజ్, నాగరాజు,కార్తీక్, శివన్న, దాదు, సుబాష్‌గాంధీ, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


బోయపేటలో గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

• ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో సర్పంచ్ మణి నేతృత్వంలో ఎమ్మెల్యే శంకరనారాయణ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల వల్ల చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ కుల, మత, రాజకీయలకు అతీతంగా నిరుపేదలను గుర్తించి సంక్షేమ పథకాలను పేదల ఇంటి ముంగిటకే తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందకపోతే అలాంటి వారిని జగనన్న సురక్ష కార్యక్రమంలో గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. పేదలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు బాషా, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు, వీరనారాయణరెడ్డి, అంగడి నారాయణరెడ్డి, వెంకటరంగారెడ్డి, శివారెడ్డి, మహేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు జాతర మహోత్సవం


వీరచిన్నయ్యస్వామి మూలవిరాట్

రొద్దం: మండలంలోని నారనాగేపల్లిలో వెలసిన వీరచిన్నయ్యస్వామి జాతర మహోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఉదయం జ్యోతుల ఉత్సవం, ఎద్దుల బండ్ల ప్రదర్శన ఉంటుందన్నారు. అదే రాత్రి స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించనున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


శివానందరెడ్డి (ఫైల్)

రొద్దం: మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి కాలనీకి చెందిన జెడ్పీ హెచ్‌ఎస్ స్కూల్ కమిటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్న, వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివానందరెడ్డి (45) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ చంద్రశేఖర్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు జెట్టి మారుతీరెడ్డి, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్ రెడ్డి తదితరులు శివానందరెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

చదువుపై శ్రద్ధ వహించండి


అగళి: మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

రొళ్ల/అగళి/అమరాపురం: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వక్తలు సూచించారు. మంగళవారం అమరాపురం, రొళ్ల, అగళి పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు.

ఖైదీల్లో మార్పు రావాలి


సబ్ జైలును పరిశీలిస్తున్న జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: చేసిన తప్పులే మళ్లీ చేస్తూ జైలుకు వచ్చి అటు కుటుంబాలకు, ఇటు సమాజానికి చెడ్డపేరు తీసుకురావద్దని స్థానిక కోర్టు అదనపు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి ఖైదీలకు సూచించారు. మంగళవారం స్థానిక సబ్ జైలును ఆమె పరిశీలించారు. ఎంత మంది ఖైదీలు ఉన్నారు? ఏఏ కేసుల్లో వచ్చారు? తదితర వివరాలను జైలర్ అంజినాయక్‌ను అడిగి తెలుసుకొన్నారు. క్షణికావేశంలో తప్పులు చేసిన వారు ఇప్పటికైనా మారాలన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలంలోని ఉగ్రారంపల్లి, పెట్టకుంటపల్లి గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్ వద్ద చౌడప్ప అనే వ్యక్తి వద్ద 30 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

•ఏపి ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం: దేవుడు ఆశీస్సులు, ప్రజల దీవెనలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. నవీన్‌నిశ్చల్ జన్మదిన వేడుకను టీచర్స్ కాలనీ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ తన జీవిత కాలం కుల మతాలకు అతీతంగా తనవంతుగా సామాజిక కార్యక్రమాలు చేస్తూనే ఉంటానన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నవీన్‌నిశ్చల్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి


హిందూపురం: శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హిందూపురంటౌన్/పెనుకొండ/రొళ్ల/రొద్దం/సోమందేపల్లి/గోరంట్ల/పరిగి/చిలమత్తూరు : బక్రీద్ పండుగ నేపథ్యంలో హిందూపురం, పెనుకొండ, రొళ్ల, రొద్దం, సోమందేపల్లి, గోరంట్లలో మంగళవారం శాంతి సమావేశాలు జరిగాయి. ఆయా ప్రాంతాల్లోని తహసీల్దార్లు, సీఐ, ఎస్‌ఐలు స్థానిక ముస్లిం పెద్దలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ కార్తీక్ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సజావుగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హిందూపురంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ముస్లిం మతపెద్దలు, పోలీసులులతో కలిసి శాంతి సమావేశాన్ని నిర్వహించారు. ప్రశాంత వాతావరణలో బక్రీద్‌ను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

పండ్ల తోటలు సాగు చేయండి

రొళ్ల: ఉపాధి పథకం ద్వారా మెట్ట ప్రాంతాల్లో పండ్ల తోటలు సాగు చేసి అధిక లాభం పొంది ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ కల్లుమడి ఆజాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో పాటు వివిధ గ్రామాల రైతులకు పండ్ల తోటల పెంపకం పై అవగాహన కల్పించారు.

జగనన్నకు అండగా నిలవాలి

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాత ఊరులో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ రేవతిని మంగళవారం స్థానిక వడ్డెర సంఘం నాయకులు సన్మానించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె సోమందేపల్లి లోని వడ్డెర కులస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వడ్డెర్ల సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు.

రూ.60 లక్షలతో పైప్‌లైన్ పనులు

పెనుకొండ: పెనుకొండ మున్సిపల్ పరిధిలో అర్హులైన ప్రతి కుటుంబానికి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామని నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ అభివృద్ధి పనులను వివరించారు. వీధి లైట్లకు సంబంధించి ఆన్ అండ్ ఆఫ్‌పై చర్యలు చేపడుతామని కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, సుధాకరరెడ్డి అడిగిన ప్రశ్నకు కమిషనర్ సమాధానం చెప్పారు. షీఫారం నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు రూ.60 లక్షలకు పైగా నిధులతో పైప్‌లైన్ ఏర్పాటుకు నివేదికలు పంపినట్లు కమిషనర్ పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సునీల్, నందిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి

అమరాపురం: మండలంలోని వలస గ్రామంలో కుంచిటి వక్కలిగుల పెద్దల ఆధ్వర్యంలో నాడ ప్రభువు కెంపేగౌడ జయంతిని గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గం కుంచిటి వక్కలిగుల సంఘం అధ్యక్షుడు, రొళ్ల జెడ్పీటసీ అనంతరాజు తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

పావగడ: బెంగళూరు నగర నిర్మాత నాడ ప్రభు కెంపే గౌడ జయంతిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ముఖ్యాధికారి షంషు, కౌన్సిలర్ సుదేశ్ బాబుతో పాటు ఉద్యోగులు కెంపే గౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీసుస్టేషన్ ముందు నిరసన

హిందూపురం అర్బన్: ఓ స్థల వివాదం విషయంలో పోలీసులు ఏక పక్షంగా వ్యవహరించారంటూ యువజన కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని 1వ పోలీసుస్టేషన్ ముందు మంగళవారం నిరసన తెలిపారు. సమస్యపై ఫిర్యాదు చేయాలని, నిరసనకు దిగడం సరికాదని సీఐ ఈరన్న వారికి సూచించారు.

ఆర్‌ఐగా గిరియప్ప బాధ్యతల స్వీకరణ

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐగా గిరియప్ప మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జాయినింగ్ కాపీని తహసీల్దార్ రమేష్‌బాబుకు ఇచ్చి విధుల్లో చేరారు.

టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు

హిందూపురం: అన్ని అర్హతలు ఉండి ఇప్పటికీ ప్రభుత్వ పథకాలు పొందలేని అర్హులైన వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని ఎమ్మెల్సీ క్యాంప్ ఆఫీస్‌లో ఎంపీ, ఎమ్మెల్సీలు విలేకరులతో మాట్లాడారు. గతంలో 600 హామీలిచ్చి చంద్రబాబు అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేశారని, అయితే ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ పక్కాగా అమలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి ఎన్నికల మ్యానిఫెస్టోలను కాపీకొట్టి టీడీపీ ప్రకటించిందన్నారు. అసలు టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. కుల, మతాలకు అతీతంగా ఓట్లు వేశారా? వేయలేదా? అని చూడకుండా ప్రభుత్వ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ఏపీ పోలీస్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్సీ ఇక్బాల్

విద్యార్థి ఆచూకీ లభ్యం


అవని మోహన్(ఫైల్)

పెనుకొండ: పట్టణంలోని సిద్ధార్థ ప్రైవేటు స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న అవని మోహన్ అనే విద్యార్థి మంగళవారం అదృశ్యమయ్యాడు. అయితే బెంగళూరులో పోలీసులు విద్యార్థిని అదుపులోకి తీసుకొని పెనుకొండ పోలీసులకు సమాచారం అందించారు. వారు ఈ విషయాన్ని విద్యార్థి తండ్రి ఉదయ శంకర్‌కు తెలియజేశారు. గాంధీనగర్ పోలీసులను సంప్రదిస్తే బాలుడిని అప్పగిస్తారని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

పనులు చేయకపోతే చర్యలు


కౌన్సిల్ సమావేశం జరుగుతున్న దృశ్యం

హిందూపురం: 'పట్టణంలోని వార్డుల్లో మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అలాగే కుక్కల బెడద నుంచి ప్రజలు రక్షించేలా చర్యలు చేపట్టాలి' అని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. మంగళవారం చైర్‌పర్సన్ ఇంద్రజ, కమిషనర్ ప్రమోద్ అధ్యర్యంలో మున్సిపల్ కౌన్సిలర్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఆరు అంశాలకే కౌన్సిల్ మీట్ ఏర్పాటు చేయడమేమిటి అని ప్రశ్నిస్తూ అజెండాను ఆమోదించారు. పనులు దక్కించుకున్నా కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. కమిషనర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో 210 పనులకు టెండర్లు, అగ్రిమెంట్లు పూర్తయినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి పనులు పూర్తిచేయాలని, లేకపోతే చర్యలు ఉంటాయని ఆదేశిస్తామన్నారు.

విద్యారంగంలో సమూల మార్పులు


విద్యా కానుక కిట్లను అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతం ఇస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కె.శివరం ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన చదువును అభ్యసించాలనే దృక్పథంతో సీఎం వైఎస్ జగన్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేశారన్నారు. ముఖ్యంగా నాడు – నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనన్నారు. అలాగే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యా కానుక కింద యూనిఫారం, పుస్తకాలు, బ్యాగు, బూట్లు, డిక్షనరీ, టై, పాఠ్య పుస్తకాలు, జగనన్న గోరుమద్ద, రాగిజావ తదితర వాటిని అందించి విద్యార్థుల చదువుకు ఎంతో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. విద్యార్థులు చేయవలసిందల్లా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగడమేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ మంజుల, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, హెచ్‌ఎం.శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో భూమి కబ్జా చేశారు

హిందూపురం టౌన్: నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్‌తో కోట్ల విలువైన తమ భూమిని కబ్జా చేశారని బాధితులు వాపోయారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో పట్టణానికి చెందిన భూపాళం లక్ష్మీనారాయణ, అతని కుమారులు శ్రీకాంత్, రాజేష్, నల్లయ్య, శిధర్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోతుకుపల్లి నుంచి మేళాపురం వెళ్లే దారిలో 66–1ఏ1లో తమకు చెందిన 18.40 ఎకరాల్లో 7.50 ఎకరాలు విక్రయించామని, మిగిలిన భూమి 6.10 ఎకరాలు తమ ఆధీనంలో ఉందన్నారు. అయితే ఇబ్రహీం సాబ్ వారసులుగా చెప్పుకునే వారు నకిలీ పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. త్యాగరాజు అనే వ్యక్తి తప్పుడు పత్రాలను సృష్టించి ఎలాంటి పాసుపుస్తకం, వన్‌బీ లేకుండానే రిజిస్టర్ చేసుకున్నారన్నారు. సబ్ రిజిస్ట్రర్లు సైతం ఏ మాత్రం పరిశీలించకుండా వారికి రిజిస్టర్ చేసి ఇచ్చారన్నారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, అయితే త్యాగరాజుకు చెందిన వ్యక్తులు తమను చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రీసర్వే వేగవంతం చేయాలి

పరిగి: జగనన్న భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న రీసర్వే వేగవంతం చేయాలి. జూలై లోపు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

రేషం షెడ్డు దగ్ధం

పెనుకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో మంగళవారం రైతు కృష్ణసాగర్‌కు చెందిన రేషం షెడ్డుకు దుండగులు నిప్పుపెట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు.


కాలిపోతున్న రేషం షెడ్డు

జగనన్న సురక్షతో అర్హులందరికీ న్యాయం


గోరంట్ల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


లేపాక్షి: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోరంట్ల: 'జగనన్న సురక్ష ' తో అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథగుప్తా, సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఇంటింటి సర్వేను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ కోరారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో గ్రామ ,వార్డు సచివాలయ కన్వీనర్లుతో జగనన్న సురక్ష ఇంటింటా సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు గ్రామాల్లో ఇంటింటా వెళ్లి జగనన్న సురక్ష సర్వేను పక్కాగా చేయాలన్నారు.

లేపాక్షి: జగనన్న సురక్షపై సర్వే మండలంలోని మానేపల్లి గ్రామంలో మంగళవారం ప్రారంభమైంది. గ్రామ సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై ఆరా తీశారు. ప్రభుత్వ పరంగా పరిష్కారం కాలేని సమస్యలను గుర్తించి వాటిని రాసుకుని ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు, దుద్దేబండ, మునిమడుగు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహించారు. ఎంపీడీఓ శివశంకప్ప సర్వేను పర్యవేక్షించారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రొద్దం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-1లో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు జగనన్న సురక్ష కార్యక్రమంపై మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చంద్రశేఖర్, ఎంఎల్ఓ సందీప్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా సర్వే చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు జనార్దన్, సురేష్, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'జగనన్న సురక్ష 'తో ఇప్పటి వరకూ వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులందరికీ న్యాయం జరుగుతుందని ఎంపీడీఓ సరస్వతి, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని బీచిగానిపల్లి పంచాయతీ పరిధిలోని పాత్రగానిపల్లి, వంగలపల్లి, గొల్లపల్లి గ్రామాలలో పర్యటించారు. మంగళవారం బీచిగానిపల్లిలో మంగళవారం సర్వేను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులతో పాటూ జగనన్న లేఅవుట్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

చిరు వ్యాపారాలతో ఆర్థికంగా ఎదగండి

అమరాపురం: గ్రామాల్లో చిన్న చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా డీఆర్పీ హేమలత అన్నారు. మంగళవారం స్థానిక వైకేపీ కార్యాలయంలో ఏపీ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు రైతులు పాల్గొన్నారు.